క్లుప్తంగా

కేలండర్ ఆవిష్కరణ



కేలండర్ ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే భూపాల్‌రెడ్డి

నారాయణఖేడ్: బ్రాహ్మణ సంఘం జిల్లాశాఖకు సంబంధించి శోభకృత్‌నామ సంవత్సర కేలండర్‌ను ఖేడ్ ఎమ్మెల్యే భూపాల్‌రెడ్డి ఆదివారం క్యాంపు కార్యాలయంలో ఆవిష్కరించారు. జెడ్పీటీసీ లక్ష్మీబాయి రవీందర్‌నాయక్, మున్సిపల్ చైర్‌పర్సన్ రుబీనా నజీబ్, మాజీ ఎంపీటీసీ ముజమ్మిల్, సంఘం బాధ్యులు మోహన్‌జ్యోషి పాల్గొన్నారు. ఖేడ్ శ్రీ సరస్వతీ శిశుమందిర్ ఉన్నత పాఠశాల వార్షికోత్సవంలో ఎమ్మెల్యే పాల్గొన్నారు. ప్రధానాచార్యులు సంజీవరెడ్డి, ఆచార్యులు పాల్గొన్నారు.

ప్రత్యేక పూజలు



పూజలో లలిత సోమిరెడ్డి

రామచంద్రాపురం(పటాన్‌చెరు): తెల్లాపూర్ మున్సిపాలిటీ పరిధిలోని అంబేడ్కర్‌కాలనీలో ఆదివారం శ్రీ అభయాంజనేయ స్వామి విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. సాయంత్రం దీపోత్సవం, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో తెల్లాపూర్ మున్సిపల్‌చైర్‌పర్సన్ మల్లెపల్లి లలితసోమిరెడ్డి, కౌన్సిలర్ జ్యోతి పాల్గొన్నారు.

చెక్కు అందజేత



చెక్కు ఇస్తున్న ఎమ్మెల్యే భూపాల్‌రెడ్డి

నారాయణఖేడ్: ఖేడ్ మున్సిపాలిటీ పరిధిలోని 2వ వార్డు, మంగల్‌పేట్‌కు చెందిన ఇద్దరికీ ఆస్పత్రి ఖర్చుల నిమిత్తం సీఎంఆర్ఎఫ్ ద్వారా రూ.1,14,500మంజూరైన చెక్కులను ఎమ్మెల్యే భూపాల్‌రెడ్డి ఆదివారం క్యాంపు కార్యాలయంలో అందజేశారు. కౌన్సిలర్ స్వప్న అభిషేక్ షెట్కార్, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ విజయ్‌బుజ్జి, కోఆప్షన్ సభ్యులు అంబదాస్ తదితరులు పాల్గొన్నారు.

బహిరంగ సభను జయప్రదం చేయండి



వాల్‌పోస్టర్ ఆవిష్కరించిన స్వేరోస్ పూర్వవిద్యార్థులు

పటాన్‌చెరు టౌన్: ఏప్రిల్ 16న నిర్వహించే భీమ్ దీక్ష ముగింపు బహిరంగ సభను విజయవంతం చేయాలని స్వేరోస్ పూర్వవిద్యార్థులు పిలుపునిచ్చారు. ఆదివారం పటాన్‌చెరు పట్టణంలోని చైతన్యనగర్ కాలనీలోని బాబు జగ్జీవన్‌భవన్‌లో బహిరంగ సభ వాల్‌పోస్టర్‌ను విడుదల చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ...మహనీయుల త్యాగాలు స్మరించుకుంటూ మార్చి 15 నుంచి ఏప్రిల్ 14 వరకు పవిత్ర దీక్షను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో విజయ్, రవి, మహేందర్, గడ్డమీది రమేశ్, సంతోష్, ప్రేమ్, సునీల్ తదితరులు పాల్గొన్నారు.

బీఆర్‌ఎస్‌లో చేరికలు



ఎమ్మెల్యే భూపాల్‌రెడ్డి సమక్షంలో బీఆర్‌ఎస్‌లో చేరిన కాంగ్రెస్ నాయకులు

కల్హేర్(నారాయణఖేడ్): ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధి పనులను చూసి బీఆర్‌ఎస్‌లో చేరుతున్నారని నారాయణఖేడ్ ఎమ్మెల్యే ఎం.భూపాల్‌రెడ్డి తెలిపారు. ఆదివారం మండలంలోని ఖానాపూర్(కె)లో సిర్గాపూర్‌కు చెందిన కాంగ్రెస్ నాయకులు బాలయ్య, మోహన్, సాయిలు, రాములు, రవి, తదితరులు బీఆర్‌ఎస్‌లో చేరారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షుడు సంజీవరావు, నాయకులు యాదవరావు, సాయిలు, భూమయ్య, లాలయ్య పాల్గొన్నారు.

పంట నష్టపోయిన రైతులను ఆదుకోవాలి

జహీరాబాద్ టౌన్: పంట నష్టపోయిన రైతులను ఆదుకోవాలని టీజేఎస్ నియోజకవర్గం ఇన్‌చార్జి ఆశప్ప కోరారు. ఆనేగుంట, ఒట్టెలగడ్డ తండాలో దెబ్బతిన్న పంటలను ఆయన పరిశీలించారు. సీఎం పర్యటించిన ప్రాంతాల్లో కాకుండా జహీరాబాద్ రైతులకు పరిహారం చెల్లించాలని ఆయన డిమాండ్ చేశారు. ఆయన వెంట సర్పంచ్ రాజు రాథోడ్, రైతులు ఉన్నారు.

అసంపూర్తిగా రోడ్డు

- అర్ధంతరంగా పనులు నిలిపివేత
- అవస్థలు పడుతున్న గ్రామస్తులు
- పట్టించుకోని కాంట్రాక్టర్, అధికారులు



రోడ్డుపై ఏర్పడిన గుంతల్లో నిలిచిన వర్షపు నీరు

రాయికోడ్(అందోల్): ఎక్కడైతే మెరుగైన రవాణ సౌకర్యం ఉంటుందో అక్కడ అభివృద్ధి సాధ్యమవుతుంది. కానీ కాంట్రాక్టర్ల అలసత్వం, అధికారుల నిర్లక్ష్యం వెరశి గ్రామీణప్రాంతాలు వెనుకబడిపోతున్నాయి. రాయికోడ్ మండలం నాగ్వార్ చౌరస్తా నుంచి రాఘవాపూర్ వరకూ సుమారు 9 కిలోమీటర్ల రోడ్డు నిర్మాణానికి ప్రధానమంత్రి గ్రామీణ సడక్ యోజన పథకం కింద రూ.4.48 కోట్లు మంజూరయ్యాయి. రోడ్డుపనుల నిమిత్తం 2021, జనవరిలో శంకుస్థాపన చేశారు. పనులు దక్కించుకున్న కాంట్రాక్టర్ కొంతవరకు పనులు చేపట్టి మధ్యలోనే నిలిపివేశాడు. అధికారుల నిర్లక్ష్యం, పర్యవేక్షణ లోపంతో పనులు మంజురైనా ముందుకు సాగడం లేదు. ఈ పనులు అర్ధాంతరంగా నిలిచిపోవడంతో గ్రామీణ ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. ఏళ్లుగా గతుకుల రోడ్లపై ప్రయాణించిన ప్రయాణికులు రోడ్డుపనులు నిలిచిపోవడంతో ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ రోడ్డు గుండా సంవత్సరాల తరబడి రాకపోకలు చేయడం, వర్షాలకు రోడ్డు కొట్టుకపోవడంతో గుంతలుగా తయారైంది. అక్కడక్కడ కంకరతేలి ప్రయాణానికి నరకంగా మారింది. ఐనప్పటికీ వాహనదారులు, స్థానికులు బిక్కుబిక్కుమంటూ రాకపోకలు సాగిస్తున్నారు. పీఎంజీఎస్‌వై పథకం కింద సింగితం నుంచి మోరట్గా వరకు సుమారు 10 కిలోమీటర్ల రోడ్డు నిర్మించేందుకు రూ.5.8 కోట్లు మంజూరైంది. దీంతో 2 కిలోమీటర్ల వరకు రోడ్డు నిర్మాణం, కల్వర్టు నిర్మాణం చేపట్టి పనులు పూర్తి కాకండానే అర్ధాంతరంగా ఆపేశారు. సింగితం, రాయిపల్లి, నాగన్‌పల్లి, కర్చల్, ఇందూర్, మామిడిపల్లి, మోరట్గా, నాగ్వార్, కుసునూర్, ఇటికేపల్లి తదితర గ్రామాలకు చెందిన ప్రజలకు ప్రయాణ కష్టాలు తప్పడంలేదు. ఇప్పటికైనా అధికారులు స్పందించి రోడ్డు నిర్మాణ పనులు పూర్తి చేయించాలని ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

తప్పని తిప్పలు

ఆర్భాటంగా పనులు ప్రారంభించిన కాంట్రాక్టరు పనులు పూర్తి చేయకుండా వదిలేయడంతో గుంతలమయంగా, కంకర తేలిన రోడ్లపై రాకపోకలు సాగించే ప్రయాణికులకు ఇబ్బందులు తప్పడంలేదు. గతంలో ఉన్న బిటీ రోడ్డుపై మచ్చుకైనా తారు కనిపించనంతగా పాడైంది. కంకర రోడ్డును తలపిస్తూ పెద్ద పెద్ద గుంతలు తేలి ఉంది. దీంతో ఆయా గ్రామాల ప్రయాణికులు 9 కిలోమీటర్ల దూరం ప్రయాణం చేసేందుకు 40 నుంచి 50 నిమిషాల సమయం పడుతోందని వారు చెబుతున్నారు.

వేసవిలో పూర్తయ్యేలా చర్యలు తీసుకోవాలి



నిలిపేసిన రోడ్డు నిర్మాణ పనులను వేసవి కాలంలోపే పూర్తి చెయ్యాలి. దీనికి సంబంధించిన బిల్లులు అందకపోవడం వల్ల కాంట్రాక్టర్ పనులు నిలిపేసినట్లు చెబుతున్నారు. ఉన్నతాధికారులు స్పందించి నిర్మాణ పనుల ప్రక్రియ వేగవంతం చేయాలి. ప్రయాణికులు, గ్రామస్తులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాల్సిన బాధ్యత అధికారులపైనే ఉంది.

సంగమేశ్వర్, నాగ్వార్, గ్రామస్తుడు

కాంట్రాక్టర్‌కు నోటీసులిచ్చాం



మండలంలోని రోడ్ల నిర్మాణానికి పనులు దక్కించుకున్న సదరు కాంట్రాక్టర్‌కు నోటీసులు అందజేశాం. పనులు ఆపేయడంపై వివరణ కోరాం. తిరిగి పనులు ప్రారంభించాలని కాంట్రాక్టర్‌కు సూచించాం. ఈ విషయంలో వారు సానుకూలంగా స్పందించారు. త్వరలో పనులు పునఃప్రారంభించి పూర్తి చేయించేందుకు కృషి చేస్తాం.

శశికుమార్, పీఆర్, ఏఈ, రాయికోడ్

ప్రజా సంక్షేమాన్ని విస్మరించిన బీజేపీ ప్రభుత్వం



మాట్లాడుతున్న రాంచందర్

జహీరాబాద్ టౌన్: కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం ప్రజా సంక్షేమాన్ని విస్మరించిందని కార్పొరేట్ వ్యక్తులకు ఊడిగం చేస్తుందని సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు బి.రాంచందర్ ఆరోపించారు. సంగారెడ్డిలో ఆదివారం సీపీఎం జన చైతన్య బస్సు యాత్రలో పాల్గొనేందుకు కార్మికులు, కర్షకులతో కలిసి తరలివెళ్లారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బీజేపీ అధికారంలోకొచ్చిన తరువాత ప్రజాస్వామ్యం గాడితప్పిందన్నారు. ఈ కార్యక్రమంలో సీపీఎం నాయకులు మహిపాల్, సలీమోద్దీన్, కొడి నర్సింలు, నరేష్, లక్ష్మణ్, రాజు, దక్షణమూర్తి, సంగన్న చంద్రన్న, బక్కన్న, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

నేటి యువత క్రీడల్లో ముందుండాలి



మాట్లాడుతున్న పట్నం మాణిక్యం

సంగారెడ్డి టౌన్: నేటి యువత క్రీడల్లో ముందుండాలని డీసీసీబీ వైస్ చైర్మన్ పట్నం మాణిక్యం అన్నారు. ఆదివారం పట్నం మాణిక్యం పౌండేషన్ ఆధ్వర్యంలో వాలీబాల్ టోర్నమెంట్‌ను నిర్వహించారు. ఈ సందర్భంగా మాణిక్యం మాట్లాడుతూ నేటి యువత క్రీడల్లో రాణించి పేరుప్రతిష్టలు సంపాదించాలన్నారు. పౌండేషన్ నుంచి సహాయ సహకారాలు ఎల్లప్పుడూ ఉంటాయన్నారు. అనంతరం విజేతలకు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో గంగా నర్సరీ మోహన్, శ్రీధర్ రెడ్డి, ప్రేమానందం తదితరులు పాల్గొన్నారు.

జాతరలతో గ్రామాల్లో పండగ వాతావరణం

బీఆర్‌ఎస్ రాష్ట్ర నాయకుడు నీలం మధు ముదిరాజ్



నీలం మధును సన్మానిస్తున్న నిర్వాహకులు

పటాన్‌చెరు టౌన్: గ్రామాల్లో జాతర్ల నిర్వహణతో పండగ వాతావరణం, ఆధ్యాత్మిక వాతావరణం చోటుచేసుకుంటుందని బీఆర్‌ఎస్ రాష్ట్ర నాయకుడు నీలం మధు ముదిరాజ్ పేర్కొన్నారు. ఆదివారం వడక్‌పల్లి గ్రామంలో నిర్వహించిన శ్రీ భ్రమరాంబ మల్లికార్జున స్వామి జాతర ఉత్సవాల్లో పాల్గొని నీలం మధు ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా నిర్వాహకులు నీలంమధు ముదిరాజ్‌ను ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ లలిత మల్లేశ్, ఉపసర్పంచ్ శ్రీకాంత్, వార్డు సభ్యులు, ఎన్ఎంఆర్ యువసేన నాయకులు పాల్గొన్నారు.

న్యాక్ త్రిసభ్య కమిటీ పర్యటన

కొండాపూర్(సంగారెడ్డి): ఈ నెల 27, 28తేదీలలో సంగారెడ్డి తారా ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో న్యాక్ త్రిసభ్య కమిటీ బృందం పర్యటించనున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ రత్న ప్రసాద్ ఒక ప్రకటనలో తెలిపారు. కేంద్ర ప్రభుత్వ ఆధ్వర్యంలోని ఉన్నత విద్య ప్రమాణాలను పెంపొందించుటకు ప్రతి ఐదు సంవత్సరాల కోసారి న్యాక్ త్రి సభ్య కమిటీ ప్రతి కళాశాలను సందర్శించి గ్రేడ్‌లను నిర్ణయిస్తుందని తెలిపారు. సర్వహంగులతో కళాశాలను తీర్చిదిద్దడం జరిగిందని, కళాశాలకు న్యాక్ ఏ+ గ్రేడ్ లక్ష్యంతో ఉపాధ్యాయ బృందం పనిచేస్తుందని తెలిపారు.

అంబేడ్కర్ ఆశయ సాధనకు కృషి



మాట్లాడుతున్న ముప్పారం ప్రకాశం

జోగిపేట(అందోల్): అంబేడ్కర్ ఆశయ సాధనకు కృషిచేయాలని బీఎస్పీ జిల్లా నాయకులు ముప్పారం ప్రకాశం అన్నారు. ఆదివారం అందోల్‌లోని అంబేడ్కర్ భవన్ గ్రామ శాఖ అధ్యక్షుడు టి.రాజు అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా ప్రకాశ్ మాట్లాడుతూ బహుజనుల బతుకుల మార్పునకు రాష్ట్ర ప్రజలకు లభించిన మరో కాన్షీరాం రూపమే డాక్టర్ ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ అని అన్నారు. ఈ సమావేశంలో పలువురు బీఆర్ఎస్ కార్యకర్తలు బీఎస్పీలోకి చేరారు. ఈ కార్యక్రమంలో చౌటకూరు మండలశాఖ అధ్యక్షుడు పల్లే కుమార్ గౌడ్, కోశాధికారి గైని కరుణాకర్, వట్‌పల్లి నాయకులు కిరణ్, జిల్లా నాయకులు ప్రసాద్, సాగర్, మహేశ్, లక్ష్మణ్, నర్సింహా, అనిల్, అశోక్, భిక్షపతి, తదితరులు పాల్గొన్నారు.

వన్ డే క్రికెట్ టోర్నమెంట్



విజేత జట్టుకు ట్రోఫీ అందజేస్తున్న దృశ్యం

సదాశివపేట రూరల్(సంగారెడ్డి): వెంకటాపూర్ గ్రామ యువకులకు ఆదివారం వన్ డే క్రికెట్ టోర్నమెంట్ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఎంపీటీసీ సభ్యుడు ఒగ్గు శ్రీనివాస్, మండల కోఆప్షన్ సభ్యుడు ఖలీల్, సర్పంచ్ కుమారుడు నరేశ్ గౌడ్ హాజరై విజేత జట్టుకు రూ.5వేలు, రన్నర్ జట్టుకు రూ.3వేలతో పాటు ట్రోఫీ అందజేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు బాబాజీ, నరేశ్, క్రీడాకారులు తదితరులు పాల్గొన్నారు.

శ్రీ జోగినాథ రథోత్సవాలు ప్రారంభం



పల్లకీ సేవలు నిర్వహిస్తున్న దృశ్యం

జోగిపేట(అందోల్): జోగిపేట శ్రీ జోగినాథ స్వామి రథోత్సవాలు ఆదివారం ప్రారంభమయ్యాయి. మొదటి రోజు స్వామి వారి గరుడ గంగ స్నానం, పల్లకీలో ఊరేగింపు, శ్రీ జోగినాథ ఆలయంలో మహా గణపతి పూజ, రుద్రాభిషేకం, పున్యవచనం కార్యక్రమాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో రథోత్సవ కమిటీ నిర్వాహకులు డాకూరి శివశంకర్, చాపల వెంకటేశం, డీబీ నాగభూషణం, రంగ సురేష్, హెచ్. రామాగౌడ్, యం. మల్లికార్జున్, అల్లే గోపాల్, జలగరి యాదగిరి, ముద్దు క్రిష్ణ, జోగయ్య, అల్లే యాదగిరి, అంతం శ్రీనివాస్, పల్వట్లా నర్సింలు, మహేందర్ మరియు అర్చకులు సుజిత్, సంగమేశ్వరప్పలు పాల్గొన్నారు.

సంక్షిప్త వార్తలు

◆ నేడు శ్రీశైలానికి బస్సులు ప్రారంభం

సంగారెడ్డి టౌన్: సంగారెడ్డి ఆర్టీసీ డిపో నుంచి శ్రీశైల దేవస్థానానికి సూపర్ లగ్జరీ బస్సులను సోమవారం ప్రారంభిస్తున్నట్లు డిపో మేనేజర్ ఉపేందర్ తెలిపారు. సంగారెడ్డి నుంచి శ్రీశైలంకు, శ్రీశైలం నుంచి సంగారెడ్డికి ప్రతిరోజు ఉదయం, మధ్యాహ్న సమయంలో బస్సులు ఉంటాయన్నారు.

◆ కార్మికుల సంక్షేమానికి కృషి

సదాశివపేట రూరల్(సంగారెడ్డి): ఎంఆర్ఎఫ్ పరిశ్రమ కార్మికుల సంక్షేమానికి బీఎంఎస్ కృషి చేస్తుందని యూనియన్ అధ్యక్ష అభ్యర్థి సుంకరి మల్లేశం అన్నారు. మండల పరిధిలోని మద్దికుంట శివారులో గల ఎంఆర్ఎఫ్ పరిశ్రమ యూనియన్ ఎన్నికల్లో భాగంగా బీఎంఎస్ ఆధ్వర్యంలో ఆదివారం గేట్ మీటింగ్ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఆయన హాజరై మాట్లాడారు. కాగడా గుర్తుపై ఓటేసి భారీ మెజార్టీతో గెలిపించాలని కార్మికులకు విజ్ఞప్తి చేశారు. కార్మికుల సమస్యల పరిష్కారానికి తను కృషి చేస్తానన్నారు.

◆ సదాశివపేటకు బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు బండి సంజయ్

సదాశివపేట(సంగారెడ్డి): బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు బండి సంజయ్ ఆదివారం సదాశివపేట బీజేపీ కౌన్సిలర్ ఓదేల రాజేశ్వరి మాణిక్‌రావు స్వగృహంలో మధ్యాహ్న భోజనం చేశారు. బసవ కల్యాణ్‌లో జరిగిన బీజేపీ సమావేశానికి హాజరయ్యారు. బండి సంజయ్‌కి ఓదెల మాణిక్‌రావు దంపతులు శివాజీ విగ్రహాన్ని అందజేశారు. ఆయన వెంట బీజేపీ నాయకులు రాజేశ్వర్‌రావు, బీజేపీ పట్టణ నాయకులు, కార్యకర్తలు ఉన్నారు.

◆ ముగిసిన ఎన్ఎస్ఎస్ శిబిరం

జహీరాబాద్ టౌన్: జహీరాబాద్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఎన్ఎస్ఎస్ యూనిట్ 1 ఆధ్వర్యంలో హోతి(బి) గ్రామంలో నిర్వహించిన శిబిరం ఆదివారం ముగిసింది. గ్రామస్తులకు పారిశుధ్యం, ప్రభుత్వ సంక్షేమ పథకాలు, ఆరోగ్య సంరక్షణ గురించి అవగాహన కల్పించారు. నిరక్షరాస్యత, నిరుద్యోగంపై గ్రామంలో సర్వే నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపల్ అస్లాం ఫారుకి, మాజీ సర్పంచ్ పర్వేజ్, ఉప సర్పంచ్ రాజు, ఎన్ఎస్ఎస్ యూనిట్ కోఆర్డినేటర్ రాములు, అధ్యాపకులు శకుంతల, అల్గోల్ మైనార్టీ కళాశాల ప్రిన్సిపల్ జమీల్ పాల్గొన్నారు.

◆ వైభవంగా మల్లన్న జాతర

సదాశివపేట రూరల్(సంగారెడ్డి): కొల్కూర్ గ్రామంలో మల్లికార్జున స్వామి జాతర వేడుకలను ఆదివారం అంగరంగ వైభవంగా నిర్వహించారు. ఉదయం మల్లన్న స్వామి కల్యాణం కనుల పండుగగా నిర్వహించారు. మహిళలు స్వామి వారికి ప్రత్యేకంగా బోనాలు సమర్పించారు. ఒగ్గు డోళ్ల తాళాలు, పోతురాజుల విన్యాసాలు, శివసత్తుల పూనకాలు జాతరలో ఆకట్టుకున్నాయి.

కాలనీల అభివృద్ధికి సంపూర్ణ సహకారం

ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి



మాట్లాడుతున్న ఎమ్మెల్యే మహిపాల్ రెడ్డి

పటాన్‌చెరు: నూతనంగా ఏర్పాటవుతున్న కాలనీల అభివృద్ధికి సంపూర్ణ సహకారం అందిస్తున్నామని ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి తెలిపారు. పటేల్ గూడ గ్రామ పరిధిలోని సిద్ధార్థ ఎన్‌క్లేవ్ కాలనీలో జీవీఆర్ ఎంటర్‌ప్రైజెస్ సంస్థ సీఎస్ఆర్ కార్యక్రమాల్లో భాగంగా రూ.60 లక్షలతో నిర్మించిన కమ్యూనిటీ హాల్‌ను ఎమ్మెల్యే ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ..అభివృద్ధి, సంక్షేమం లక్ష్యంగా తమ ప్రభుత్వం పని చేస్తుందన్నారు. అనంతరం కాలనీ వాసులు ఎమ్మెల్యేను ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ దేవానందం, జెడ్పీటీసీ సుధాకర్ రెడ్డి, సర్పంచ్ నితీశా శ్రీకాంత్, వైస్ ఎంపీపీ సునీత సత్యనారాయణ, ఉప సర్పంచ్ జానకి జ్ఞానేశ్వర్, భ్రమరాంబ మల్లికార్జున స్వామి దేవాలయం కమిటీ చైర్మన్ తులసి రెడ్డి, కాలనీ వాసులు పాల్గొన్నారు.

అభివృద్ధిలో భాగస్వాములు కావాలి

అభివృద్ధిలో ప్రతీ ఒక్కరూ భాగస్వాములు కావాలని ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి తెలిపారు. దుర్గానగర్ కాలనీలో నూతనంగా ఏర్పాటు చేసిన దుర్గా నగర్ ఫ్లాట్ ఓనర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ కార్యాలయాన్ని ఆదివారం రాత్రి ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా గ్రామ కోడెల నుంచి కాలనీ వరకు మహిళలు కాలనీవాసులు ఘన స్వాగతం పలికారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. ప్రత్యేక తెలంగాణ ఏర్పడిన అనంతరం పటాన్‌చెరు నియోజకవర్గం అన్ని రంగాల్లో అభివృద్ధి చెందుతుందన్నారు. పారిశ్రామిక రంగంలో చేపడుతున్న సంస్కరణల మూలంగా.. నూతన పరిశ్రమలు ఏర్పాటవుతున్నాయని తెలిపారు. దీనికి అనుగుణంగానే పెద్ద సంఖ్యలో ఉద్యోగాలు లభిస్తున్నాయని ఎమ్మెల్యే తెలిపారు. ఈ కార్యక్రమంలో అమీన్‌పూర్ ఎంపీపీ దేవానందం, జెడ్పీటీసీ సుధాకర్ రెడ్డి, వైస్ ఎంపీపీ సునీత సత్యనారాయణ, ఉప సర్పంచ్, దుర్గా నగర్ కాలనీ అధ్యక్షుడు ఎండి ఫహీం, అమీన్‌పూర్ మున్సిపల్ వైస్ చైర్మన్ నరసింహా గౌడ్, బీఆర్ఎస్ సీనియర్ నాయకులు గూడెం మధుసూదన్ రెడ్డి, ఆలయ కమిటీ చైర్మన్ తులసి రెడ్డి, రాజు, యూనిస్, కాలనీ వాసులు పాల్గొన్నారు.

నిరంతర విద్యుత్ కోసం వినతి



అధికారులతో మాట్లాడుతున్న ఎంఐఎం నాయకులు

నారాయణఖేడ్: రంజాన్ ఉపవాస దీక్షలను పురస్కరించుకొని నెలరోజులపాటు ఖేడ్ మున్సిపాలిటీ పరిధిలో నిరంతర విద్యుత్ సరఫరా చేయాలని ఎంఐఎం నాయకులు ట్రాన్స్‌కో అధికారులకు వినతి ప్రతం అందజేశారు. ఆదివారం పార్టీ ఖేడ్ పట్టణ ప్రధాన కార్యదర్శి మొహిద్‌పటేల్ నాయకులతో కలిసి ట్రాన్స్‌కో కార్యాలయానికి వెళ్లి అధికారులతో మాట్లాడారు. ఈ మధ్య తరచూ విద్యుత్ సరఫరాలో అవాంతరాలు ఏర్పడుతున్నాయని వారి దృష్టికి తీసుకెళ్లారు.

మన్‌కీబాత్ వీక్షించిన బూత్‌కమిటీ బాధ్యులు



నారాయణఖేడ్‌లో మన్‌కీబాత్ వింటున్న బీజేపీ నేతలు

నారాయణఖేడ్: ప్రధానమంత్రి నరేంద్రమోడీ ఆదివారం మన్‌కీబాత్‌లో భాగంగా దేశప్రజలను ఉద్దేశించి మాట్లాడగా దూరదర్శన్ సప్తగిరి ఛానల్ ప్రత్యక్ష ప్రసారం చేసింది. ఖేడ్‌లో బీజేపీ అసెంబ్లీ కన్వీనర్ రజినీకాంత్, బూత్‌కమిటీ బాధ్యులు సాయిరాం, సుధాకర్, రాజశేఖర్‌గౌడ్, సతీష్, ఏక్‌నాథ్, దశరత్ యాదవ్, సాయిసాగర్, లోకేష్, అశోక్ తదితరులు ప్రత్యక్ష ప్రసారాన్ని వీక్షించారు. వివిధ గ్రామాల్లోనూ టీవీల ద్వారా పార్టీ నాయకులు, కార్యకర్తలు ప్రధాని మాటలు విన్నారు.

గురుకులం ప్రిన్సిపాల్‌పై చర్యలు తీసుకోవాలి

నారాయణఖేడ్: ఖేడ్ సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలలో ఇంటర్మీడియెట్ పరీక్షలకు విద్యార్థులను సరుకు రవాణా వాహనంలో పశువుల తరహాలో తరలించిన ప్రిన్సిపాల్ సాయిరెడ్డిపై కఠిన చర్యలు తీసుకోవాలని కేవీపీఎస్ జిల్లా ఉపాధ్యక్షుడు కొటారి నర్సింహులు డిమాండ్ చేశారు. ఆదివారం నారాయణఖేడ్‌లో ప్రిన్సిపాల్ వైఖరిని నిరసిస్తూ సంఘం ఆధ్వర్యంలో నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దళిత విద్యార్థుల పట్ల చిన్నచూపు చూస్తూ విద్యార్థులను సరుకులు తరలించే వాహనంలో తీసుకెళ్లడం బాధాకరమన్నారు. కేవీపీఎస్ నాయకులు బస్వరాజ్, విశాల్ తదితరులు పాల్గొన్నారు.

ఉత్సవాలను భక్తి శ్రద్ధలతో జరుపుకోవాలి



ఉత్సవాల్లో పాల్గొన్న ఎమ్మెల్యే

జిన్నారం(పటాన్‌చెరు): జాతర ఉత్సవాలను ప్రజలు భక్తి శ్రద్ధలతో జరుపుకోవాలని ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి సూచించారు. కానుకుంట గ్రామంలో నల్లపోచమ్మ జాతరను ఆదివారం నిర్వహించారు. ఈ ఉత్సవాలకు ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి మాట్లాడుతూ గ్రామాల్లో నిర్వహిస్తున్న జాతర్లను ప్రజలు భక్తి శ్రద్ధలతో జరుపుకోవాలని సూచించారు. దేవాలయాల అభివృద్ధికి కృషి చేస్తానన్నారు. అనంతరం బేగంపేటలోని మహిళా ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఎన్ఎస్ఎస్ శిబిరాన్ని ఆయన ప్రారంభించారు. ఎంపీపీ ప్రవీణ, జెడ్పీటీసీ సభ్యుడుకుమార్‌గౌడ్ పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో బీరప్ప స్వామికి బోనాలు



బోనాలతో ఆలయానికి వెళ్తున్న భక్తులు

రాయికోడ్(అందోల్): నాగ్వార్ గ్రామంలో బీరప్ప జాతర సందర్భంగా ఆదివారం భక్తిశ్రద్ధలతో బోనాలు సమర్పించారు. ఆలయంలో ప్రత్యేక పూజల అనతరం గ్రామస్తులు నిష్ఠతో బోనాలను సిద్ధం చేసుకొని ఊరేగింపుగా ఆలయం వరకు చేరుకున్నారు. ఈ సందర్భంగా పోతురాజుల విన్యాసాలు, డోలు వాయిద్యాల మధ్య భక్తి శ్రద్ధలతో బోనాలు జరుపుకున్నారు. బీరప్ప స్వామి నామ స్మరణతో గ్రామంలో ఆధ్యాత్మిక శోభ సంతరించుకుంది. నిర్వాహకులు భక్తులకు అన్నదానం ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు, ఆలయ నిర్వాహకులు పాల్గొన్నారు.

బీఆర్‌ఎస్ ఆత్మీయ సమ్మేళనాలు నిర్వహిస్తాం



మాట్లాడుతున్న వెంకట్రాంరెడ్డి, ఎమ్మెల్యే మాణిక్‌రావులు

జహీరాబాద్ టౌన్: సంక్షేమ ఫలాలు, బీఆర్‌ఎస్ అభివృద్ధిపై గడప గడపకూ వివరించాలని సీఎం కేసీఆర్ ఆదేశాల మేరకు జహీరాబాద్ నియోజకవర్గంలో ఆత్మీయ సమ్మేళనాలను నిర్వహించనున్నట్లు పార్టీ జిల్లా ఇన్‌చార్జి, ఎమ్మెల్సీ వెంకట్రాంరెడ్డి అన్నారు. ఆదివారం ఆయన జహీరాబాద్‌లో ఎమ్మెల్యే మాణిక్‌రావు, డీసీఎంఎస్ చైర్మన్ ఎం.శివకుమార్‌లతో విలేకరుల సమావేశంలో మాట్లాడారు. పార్టీకి కార్యకర్తలే బలమని, సమ్మేళనంలో పాల్గొనే కార్యకర్తలకు ప్రాధన్యత కల్పిస్తామన్నారు. ప్రజల సంక్షేమ కోసం సీఎం కేసీఆర్ చేపడుతున్న సంక్షేమ కార్యక్రమాలు, పథకాల తీరును ప్రజలకు వివరిస్తామన్నారు. నియోజకవర్గంలో 138 గ్రామాలు, 37 మున్సిపల్ వార్డుల్లో ఆత్మీయ సమ్మేళనాలను నిర్వహిస్తామన్నారు. కొన్ని గ్రామాలను కలుపుకుని 11 లేదా12 యూనిట్‌లుగా సమావేశాలు నిర్వహించాలని నిర్ణయించామన్నారు. ఆయా గ్రామాల పార్టీ నాయకులు,కార్యకర్తలు పాల్గొంటారని చెప్పారు బీఆర్‌ఎస్ నాయకులు తన్వీర్ పాల్గొన్నారు.

ఉచిత వైద్య శిబిరం

సదాశివపేట రూరల్(సంగారెడ్డి): మల్లన్న స్వామి జాతర సందర్భంగా భక్తుల సౌకర్యార్థం గోకుల్ వెంకటేశ్వర సూపర్ స్పెషలిటీ ఎండీ డాక్టర్ శ్రీహరి ఆధ్వర్యంలో భక్తులకు ఉచిత వైద్య పరీక్షలను నిర్వహించారు. 284మందికి మందులను అందజేశారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ భూపాల్ రెడ్డి, మాజీ సర్పంచ్ మాణిక్, డాక్టర్లు రుద్ర, బాగారెడ్డి, శ్రీకాంత్, జలేందర్, బాలకృష్ణ, అశ్విన్, సబిత, సంగీత తదితరులు పాల్గొన్నారు.